క్లుప్తంగా

బాధితులకు పేర్ని కిట్టు పరామర్శ



మచిలీపట్నంటౌన్: పలు ఘటనల్లో మృతి చెందిన వ్యక్తుల కుటుంబ సభ్యులను, బాధితులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం పరామర్శించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చిన ఆయన అయిన వారిని కోల్పోయి రోధిస్తున్న మహిళలను,కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోస్టు మార్టం ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తి చేసి బంధువులకు అప్పగించాలని ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావును కోరారు. కిట్టు వెంట కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, పార్టీ నాయకులు ఉదయ్‌కుమార్, నాగరాజు ఉన్నారు.

టీపీవో బాధ్యతల స్వీకరణ



పెడన: స్థానిక పురపాలక సంఘ టౌన్ ప్లానింగ్ అధికారిణిగా బి సుగుణకుమారి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. మచిలీపట్నం ముడా కార్యాలయం నుంచి బదిలీపై పెడనకు వచ్చారు. బాధ్యతలను స్వీకరించిన టీపీవోను పట్టణంలోని తొమ్మిది సచివాలయాలకు చెందిన ప్లానింగ్ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ



పెడన: పారిశుద్ధ్య కార్మికులకు వేర్వేరుగా తడి, పొడి చెత్తలను అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 21, 22వ వార్డులలో స్వచ్ఛతాహీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు, టీడీపీ నాయకులు శ్యామలారావు, యర్రా రాజా, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాపు సంఘం నేత పోలిశెట్టికి నివాళి



నాగాయలంక: కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ ధాన్యం వ్యాపారి పోలిశెట్టి మురహరిరావు (మర్రిపాలెం) సేవలు నిరుపమానమని పలువురు నేతలు కొనియాడారు. మండల శ్రీకనకదుర్గ, కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ (చిన్నారి) ఆధ్వర్యంలో నాగాయలంక సాయిబాబా మందిరం కూడలిలో శుక్రవారం పోలిశెట్టి సంస్మరణ కార్యక్రమం జరిగింది. తొలుత పలువురు, కాపు నాయకులు వివిధ పార్టీల నేతలు పూల మాలలు వేసి జోహార్లర్పించారు. బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు (చినబాబు) తోట శ్రీనివాసరావు, తలశిల స్వర్ణలత, మెండు లక్ష్మణరావు, వర్రే రాంబాబు తదితర కాపు నేతలు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన అసోసియేషన్ నేతలు



పెడన: ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్‌గా నూతనంగా నియమితులైన మచిలీపట్నం పార్లమెంటు మాజీ సభ్యుడు కొనకళ్ల నారాయణరావును శుక్రవారం ఏపీ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు కలిసి అభినందించారు. కె.చంద్రశేఖర్, ఎ.గౌరీప్రసాద్, వీడీ శివప్రసాద్, కేడీఎన్‌వీ ప్రభాకర్, వీడీ నవీన్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

దేవస్థానాల్లో స్వచ్ఛతాహీ సేవ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయడీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు నేతృత్వంలో ఉదయం స్వయంగా చీపుర్లు పట్టి కల్యాణ మండపం, నాగశిలలను శుభ్రం చేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల సత్తా

గూడూరు: క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గూడూరు జెడ్పీ హైస్కూలులో నిర్వహిస్తున్న పెడన నియోజకవర్గ స్థాయి అండర్–14, 17 క్రీడాకారుల ఎంపికలను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహిస్తున్నామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలలో సత్తాచాటాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, మాజీ డీసీ చైర్మన్ పోతన స్వామి, గోపి నాగబాబు, పోతన రామోజీ, డీవైఈఓ బీఎస్‌సి సింగ్, నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి మురళీకృష్ణ, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం పుష్పలత తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం బాలుర విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ విభాగాలలో ఎంపికలు నిర్వహించగా, శనివారం బాలికల విభాగంలో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి మురళీకృష్ణ తెలిపారు.

పాఠశాల క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నాగాయలంక: నియోజకవర్గం స్థాయిలో ఖోఖో క్రీడాకారుల ఎంపిక పోటీలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన నలుగురు బాలికలు కృష్ణా జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్.ఎం. పీఎస్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కోడూరు మండలం లింగారెడ్డిపాలెం హైస్కూలులో శుక్రవారం ఈ ఎంపిక పోటీలు జరిగాయన్నారు. అండర్–17 బాలికల ఖోఖో విభాగంలో నాయుడు జ్యోతి, తమ్ము భావన, నాయుడు దివ్య, బొడ్డు శ్రావణి ఎంపికయ్యారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారు. బాలికలను, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావును హెచ్.ఎం.ప్రసాద్, సిబ్బంది, ఎస్ఎంసీ చైర్మన్ వక్కపట్ల మూరుతి అభినందించారు.



ఘంటసాలలో కబడ్డీ జట్టును అభినందిస్తున్న శ్రీకాకుళం హైస్కూల్ విద్యాకుటుంబం



పెడనలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



నాగాయలంకలో జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్.ఎం ప్రసాద్, పీడీలు

కబడ్డీ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం(ఘంటసాల): కబడ్డీ పోటీలో శ్రీకాకుళం జెడ్పీ హైస్కూలు జట్టు నియోజకవర్గస్థాయిలో ప్రతిభ చాటింది. అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంక జెడ్పీ హైస్కూల్ ప్లస్ ప్రాంగణంలో ఈ పోటీలు జరిగాయి. వివరాలను జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి శుక్రవారం చెప్పారు. అండర్–17 విభాగంలో బి.అఖిల్ కృష్ణ దత్త, అండర్–14 విభాగంలో కె.బలరామకృష్ణ, బాలికల విభాగంలో పి.అక్షయ, ఎన్.జ్ఞానశ్రీలు ప్రతిభ చాటి కృష్ణా జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను కబడ్డీ పోటీలకు శిక్షణ ఇచ్చిన పీడీ బడే వెంకటేశ్వరరావును, విద్యా కుటుంబం అభినందించారు.

ఎంవీకే గొప్ప మానవతావాది

అవనిగడ్డ: మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు గొప్ప మానవతా వాదని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. మండలి వెంకట కృష్ణారావు 27వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. స్థానిక వంతెన సెంటర్‌లో వెంకట కృష్ణారావు విగ్రహానికి ఆలపాటి, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు పూలమాలవేసి నివాళులర్పించారు.స్థానిక గాంధీక్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి, కోడూరు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని మాజీ మంత్రి ఆలపాటి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు వారందరినీ ఒకతాటిపైకి తీసుకొచ్చిన భాషాభిమాని వెంకట కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడారు.

350 మందికి వైద్య పరీక్షలు

విజయవాడకు చెందిన హెచ్‌సీజీ హాస్పటల్ నిర్వాహకులు గోపీచంద్, క్యాపిటల్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్(రాజా), గాంధీక్షేత్రం కార్యదర్శి మత్తి వెంకటేశ్వరరావు, కోడూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్న సాయిబాబు పాల్గొన్నారు.



వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

నాగాయలంక: దివిసీమ కాంగ్రెస్ నేత మండలి వెంకట కృష్ణారావు వర్ధంతిని ఎంవీకేరావు గ్రామ వికాస సమితి, మండల టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భావదేవరపల్లి గ్రామ ప్రధాన కూడలిలో, పార్టీ ఆధ్వర్యంలో నాగాయలంక సాయిబాబా గుడి సెంటర్‌లో మండలి విగ్రహానికి సీనియర్ నాయకులు నివాళులర్పించారు. నాగాయలంకలో గాంధీ, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు కూడా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, టీడీపీ మండల అధ్యక్షుడు మాజీ సర్పంచి మెండు లక్ష్మణరావు, తలశిల స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

40 మంది రక్తదానం

మోపిదేవి: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు వర్ధంతి సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, యువజన గ్రామీణ వికాస సమితి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మోపిదేవి కెనరాబ్యాంకు సమీపంలో శుక్రవారం నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 40 మంది రక్తదానం చేయగా అతిథులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కేబీఎన్ కాలేజ్ ప్రిన్సిపాల్ వంగల నారాయణరావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ టీఎస్ఎస్ బాలాజీ, ట్రెజరర్ కొండపల్లి రాంబాలాజీ, కార్యదర్శి భవరి శంకర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: దివంగత మండలి వెంకటకృష్ణారావు వర్ధంతి సందర్భంగా కూటమి నేతలు పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక పశు వైద్యశాలలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. శిబిరంలో పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వాటికి ఉచితంగా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, నేతలు బచ్చు వెంకటేష్, వేములపల్లి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన అధికారులు







ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన పలు శాఖల అధికారులు శుక్రవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. కలెక్టర్‌ను కలిసినవారిలో వరుసగా పీఆర్ ఎస్ఈ రమణరావు, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి గంగాధరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విద్యాసాగర్, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు

–చిలకలపూడి(మచిలీపట్నం)

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం(ఘంటసాల): మండల స్థాయిలో జరిగిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి మాట్లాడుతూ ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం స్వర్ణాంధ్ర–2047పై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో శ్రీకాకుళం హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఆత్కూరి జ్యోతి వ్యాస రచనలో, తోపుల హంసిక ఫణిదేవి వక్తృత్వంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని చెప్పారు. ఆయా విద్యార్థులకు ఎంఈవో–2 ఎండీ మోమిన్ చేతుల మీదగా బహుమతులు అందించగా, ఇతర విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు అందించారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను, ఉపాధ్యాయులను హెచ్ఎం, సహోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.



శ్రీ కాకుళం హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో–2 మోమిన్, ఉపాధ్యాయులు

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

పెడన: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం ఉదయం పట్టణంలోని 11వ వార్డులో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందన్నారు. ఈ పూజలకు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులంతా తరలిరావాల్సిందిగా ఆయన కోరారు.

అన్నసమారాధన



గుడివాడ టౌన్: స్థానిక శ్రీరామ్‌పురం పుల్లపాడు వంతెన వద్ద ఉన్న శ్రీ బాల గణపతి స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిసిన సందర్భంగా శాంతి నిమిత్తం ఈ అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ పాలకవర్గ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఈఓ గోపాలరావు



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా బదిలీపై వచ్చిన గోపాలరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక కాకర్లవీధిలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ గోపాలరావుకు బాధ్యతలు అప్పగించారు. గోపాలరావు భీమేశ్వరాలయం, వేణుగోపాలస్వామి దేవస్థానం, చిన్న శివాలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, ప్రభుత్వ ఆధీనంలోని ధర్మకర్తల సత్రాలకు కార్యనిర్వాహణాధికారిగా వ్యవహరిస్తారు.

శరన్నవరాత్రులకు ఏర్పాట్లు సిద్ధం చేశాం

నాగాయలంక: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమనిృత శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానంలో 32వ వార్షిక శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు అమ్మవార్లకు నిత్యం ప్రత్యేక అలంకారాలు ఉంటాయన్నారు. 3న ఉదయం గం.8.42లకు శ్రీచక్ర కలశ పీఠం స్థాపనతో ఉత్సవాలకు శ్రీకారం జరుగుతుంది. రోజూ దంపతులతో ప్రధాన పీఠం వద్ద పూజ, విశేష రోజుల్లో సామూహిక కుంకుమ పూజ ఉంటుంది. రోజూ శ్రీలలితా శ్రీలక్ష్మీ సహస్రనామ సామూహిక పారాయణం ఉంటుంది. దసరా ఉత్సవాలకు పలు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు.

ఆత్మీయ కలయిక




జగనన్నతో వైఎస్సార్ సీపీ నేతలు అవిర్నేని ప్రపూర్ణ చంద్, కుంపటి శరత్ బాబు

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గురువారం ఘంటసాల మండల వైఎస్సార్ సీపీ నేతలు అవిర్నేని ప్రపూర్ణ చంద్, కుంపటి శరత్ బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగనన్న స్థానికంగా పార్టీ పరిస్థితిని ఆరా తీసి, గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారని చెప్పారు.

– ఘంటసాల

వ్యర్థాలతో తయారు చేసిన వస్తువుల ప్రదర్శన

పెడన: స్వచ్ఛతా హీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో విద్యార్థులకు వ్యర్థాలతో తయారు చేసిన వస్తువుల (వేస్ట్ ఆఫ్ ఆర్ట్స్) ప్రదర్శన పోటీలను శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. వీటిని ఎంఈవో–2 వై.హరినాథ్, న్యాయనిర్ణేతలు పరిశీలించారు. మండల స్థాయిలో తోటమూల జెడ్పీహెచ్ఎస్, ఏపీఆర్‌డబ్ల్యూఎస్ బల్లిపర్రు గురుకులపాఠశాల,పెడన విశ్వభారతీ హైస్కూలు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ఎంఈవో తెలిపారు. అక్టోబరు 2వ తేదీన జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయిలో ప్రదర్శనలో మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వ్యర్థాలతో తయారు చేసిన పలు బొమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి.స్వచ్ఛతాహిసేవకార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో 15 రకాల వ్యర్థాలతో విద్యార్థినులు పలు రకాల బొమ్మలు తయారు చేశారు. లింగం ఉషశ్రీ, మారుబోయిన శ్రీవాణి, ఆనందాసు డీల్సీలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.విజేతలను, ప్రోత్సహించిన ఉపాధ్యాయులను హెచ్ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయు లు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, తదితరులు అభినందించారు.



వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఎంఈవో హరనాథ్‌బాబు, న్యాయ నిర్ణేతలు

పూజలకు సిద్ధంగా దుర్గమ్మ ప్రతిమలు



పూజలందుకునేందుకు సిద్ధమైన దుర్గమ్మ విగ్రహాలు



తుది మెరుగులు దిద్దుకున్న దుర్గమ్మ విగ్రహం

మచిలీపట్నంటౌన్: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పందిళ్లలో కొలువుదీరి పూజలందుకునేందుకు దుర్గమ్మ విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. నగరంలోని పెడన రోడ్డులో ఉన్న వలందపాలెంలో దుర్గమ్మ విగ్రహాల తయారీ కేంద్రాలలో అమ్మవారి విగ్రహాలకు కళాకారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఆర్డర్లతో పాటు విక్రయాలకు వారు అమ్మవారి విగ్రహాలను తీర్చిదిద్ది పందిళ్లకు పంపేందుకు సిద్ధం చేశారు. ఈ మార్గంలో వెళ్లే వారు తది మెరుగులు దిద్దుకుంటూ ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మవారి విగ్రహాలను తిలకించి తన్మయం చెందుతున్నారు. దుర్గమ్మ రూపాలను తిలకించి దండాలు పెతున్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దుర్గమ్మతల్లి విగ్రహాలకు గిరాకీ పెరిగింది.

రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి



మృతి చెందిన శివశంకర్

పెడన: స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ఒక వ్యక్తి శుక్రవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందాడు. సేకరించిన, పోలీసులు తెలిపిన వివరాల మేరకు నెల్లూరు జిల్లా కోవూరు మండలం చినపడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌కు చెందిన సముద్రాల శివశంకర్ (41) పెడన మండలం బల్లిపర్రులో నివాసం ఉంటున్నాడు. మచిలీపట్నంలోని పెట్రోల్ బంకులో పనిచేస్తున్న ఇతను తన సొంతూరు నేతాజీనగర్‌కు వెళ్లి శుక్రవారం ఉదయం పెడన రైల్వే స్టేషన్‌లో రైలు దిగాడు. ద్విచక్ర వాహనాన్ని తీసుకుని వస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండెనొప్పి వచ్చి కింద పడిపోయాడు. సమీపంలోని కొందరు సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. అతని ప్యాంటు జేబులోని ఆధార్‌కార్డు ద్వారా వివరాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు సమచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఈ సంఘటనపై ఎటువంటి పోలీస్ కేసు నమోదు కాలేదు.

ట్రాక్టర్ ట్రక్కు తిరగబడి వ్యక్తికి గాయాలు

పెడన: పెడన, బంటుమిల్లి జాతీయ రహదారిపై నందమూరు పీఏసీఎస్ పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం ట్రాక్టరు ట్రక్కు తిరగబడి ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు.. ట్రాక్టరు ట్రక్కు పాత మట్టి, రాళ్ల లోడుతో పెడన వైపు వస్తుండగా అదే మార్గంలో ద్విచక్ర వాహనంపై వ్యక్తి వస్తూ పెట్రోల్‌బంకులోకి వెళ్లేందుకు సడెన్‌గా మలుపు తిప్పాడు. దీంతో ట్రాక్టర్ బ్రేక్ వేయడంతో ట్రక్కు తిరగబడింది. ట్రక్కులో మట్టి, రాళ్లు ద్విచక్ర వాహనంపై పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో పాటు వాహనం పూర్తిగా దెబ్బతింది. అయితే ఈ సంఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు. రాజీ పడి ఉండవచ్చని, అందువల్ల పోలీస్ స్టేషన్‌కు రాలేదని అంటున్నారు.



గాయపడ్డ ద్విచక్రవాహనదారుడు

కొల్లేటి సరస్సును పర్యాటక కేంద్రంగా పునరుద్ధరించాలి

మండవల్లి: కొల్లేటి సరస్సును పర్యాటక కేంద్రంగా పునరుద్ధరిస్తే రాష్ట్రానికి ఆదాయంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తుందని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కర రావు, టి.అప్పారావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం వారు మాట్లాడుతూ గతంలో మంత్రులు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కూటమి ప్రభుత్వ విజయోత్సవంలో కొల్లేరు సరస్సును పర్యాటకంగా అభివృద్ధి చేసి మరింత గుర్తింపు తెస్తామని పేర్కొన్నారని తెలిపారు. కొల్లేరును పర్యాటకంగా పునరుద్ధరిస్తే ప్రపంచంలోనే పెద్ద పర్యాటక కేంద్రంగా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.